# పులి ఆకలి

మన్మథుడి విల్లు వంచినట్టుగా ఉంది గోమతి. పుష్టిగా ఉన్న చెక్కిళ్లు. కసిగొల్పుతోన్న పెదవులు. యౌవనపు జెండాల్లా ఉన్న స్తనద్వయం. స్వర్గానికి దారి చూపుతున్నట్టుగా ఉన్న నడుం వంపు....

ఓహ్! 'మూర్తీభవించిన లావణ్యం!' అనుకున్నాడు ఆమెనే రెప్ప వేయకుండా చూస్తున్న పులిరాజు. ఆ ఆఫీసులో ఆమె గుమస్తా. అతడా ఆఫీసుకి బాస్.

వంగి ఏదో ఫైలు వెదుకుతోన్న గోమతి కేబిన్ అద్దంలోంచి స్పష్టంగా కన్పిస్తోంద తడికి.

అతడా గ్లాస్‌లోంచి హాల్లోని అందర్నీ చూడగలడు. కానతడు బయటున్న వారికి కన్పించడు. అందుకే ఆ అద్దమంటే అతడికెంతో ఇష్టం. రోజులో సగకాలం అందులోంచి ఆఫీసు అమ్మాయిల్ని గమనిస్తూ చూపుల్తో త్రాగేస్తూ సగం కడుపు నింపుకుంటూంటాడు.

నిటారుగా అయ్యింది గోమతి. ఆమె పయ్యెద స్థానభ్రంశం చెందింది. ఆమె జంట కలశాల్లో ఒకటి బయటపడింది.

పులిరాజు గుండె రెండంగుళాలు క్రిందికి జారింది.

'ఇక లాభం లేదు. ఈ టెన్షన్ భరించడం నా తరంకాద'నుకున్నాడు. కేబిన్ ఏసీ అయినా ముచ్చెటమలు పోస్తున్నాయతడికి.

అసహనంగా సీట్లో కూర్చుని ఆలోచనలో పడ్డాడు. ఎలా ప్రొసీడవడం? ఎలా ప్రొసీడైతే ఆమె తనదవుతుంది? తనీ ఆఫీసుకి బాస్. అయినా ఆమె భయపడకపోవచ్చు!

తను ఒక మోస్తరు అందగాడే. నడివయస్సు దాటినా బిగిసడలని వాడే. అయినా ఆమె బుట్టలో పడకపోవచ్చు. తను డబ్బివ్వగలడు. అయినా ఆమె ప్రలోభపడకపోవచ్చు.

మరెలా అయితే ఆమె లొంగివచ్చి తన కౌగిల్లో ఒదిగిపోతుంది? తీవ్రంగా ఆలోచించాడు.

ఆమె బలహీనత ఏమిటో తెలుసుకుని 'నొక్కాలి' అనుకున్నాడు. వెంటనే ఆమె పర్సనల్ ఫైలు తెమ్మన్నాడు.

తేబడింది. ఫైలు ఆసాంతం తిరగేశాడు.

అందులో సగం ఆమె పనిని మెచ్చుకుంటూ ఇచ్చిన అభినందన లేఖల కాపీలే.

కాని అందులో పొందుపరచబడిన వివరాల ప్రకారం ఆమె కుటుంబానికి ఆమె జీతం చాలా అవసరం. అంటే ఆమెకి ఉద్యోగం అత్యంత విలువైంది.

చటుక్కున అతడి కళ్లు మెరిశాయి.

మెరిసిన అతడి కళ్లల్లో మరో కాగితం పడింది.

ఆమె తనని లంచం అడిగిందనీ ఇవ్వనందుకు తన ఫైలు తొక్కి పెట్టిందనీ నీలకంఠం అనే రా మెటీరియల్ సప్లయర్ చేసిన కంప్లయింటు అది. దాని మీద అప్పటి ఆఫీసరు 'నాన్సెన్స్' అని అడ్డంగా రాసేశాడు.

పెదాలు తడుపుకుంటూ నవ్వుకున్నాడు పులిరాజు.

అతడు రాసింది అక్షరసత్యం. అందులో ఇసుమంత సందేహం లేదు. గోమతి ఇరవైనాలుగు కేరట్ల బంగారం. నీలకంఠం నీచుల్లో కెల్ల నికృష్టుడు.

అయినప్పటికీ దానిని తను అస్త్రంగా మలచుకోవచ్చు. నీలకంఠాన్ని దువ్వితే మరో రెండు కంప్లయింట్లు పుట్టించగలడు. వాటిని ప్రయోగిస్తే?

వాడి బాణం దెబ్బతగిలిన పక్షి కూనలా విలవిల్లాడిపోదూ? ఏ దారీ లేక దాసోహమంటూ ఆమె అందాల్ని తన కాళ్ళ దగ్గర బోర్లించదూ?!

'దట్స్ ఎ గుడ్ ఐడియా' నవ్వుకున్నాడతను.

బయట వర్షం మొదలయ్యింది. 'గుడ్-ప్రకృతి కూడా నాకు ఫేవర్ చేస్తోందన్నమాట' అనుకున్నాడు.

ఇంటర్‌కమ్‌లో గోమతిని ఉన్నపళాన రమ్మని పిలిచాడు. హడావిడిగా వచ్చిందామె.

కళ్ళతో ఆమెని ఆసాంతం పరీక్షించాడు. గోమతి పొడగరి. సన్నగా చాకులా ఉంటుంది. చక్కని అవయవ సంపద ఆమె ప్రత్యేకత. ఒక్క మాటలో చెప్పాలంటే మగతనానికి సవాలులా ఉంటుందామె.

పులిరాజు ఆమె కన్నా నాలుగంగుళాలు పొట్టి. అతడి దృష్టిలో ఆమె చిరారు కొమ్మనున్న మిఠాయి పొట్లం! ఆకాశాన వయ్యారంగా నిలిచి ఊరించే జాబిల్లి!

"కూర్చో గోమతీ. అలసినట్టున్నావ్. కాఫీ త్రాగుదాముండు..." అన్నాడు పులిరాజు.

"వద్దు సార్. థాంక్యూ..." ఒద్దికగా కూర్చుంటూ అంది గోమతి.

"మనలో మనకి సార్లూ సారీలూ ఏమిటి చీరెలూ చీర్లూ చెప్పుకోవాలిగానీ!" భళ్ళున నవ్వేడు ఒళ్ళంతా కదిలేలా.

ఆమె నుదురు ముడివడింది. అతడు గ్రంథసాంగుడని తెలుసు. అందుకే కించిత్తు కలవరంగా చూసింది.

"కామ సినిమాకెళ్లామనుకుంటున్నాను. కంపెనీ ఇవ్వకూడదూ!" అన్నాడతను.

"సారీ సార్. సినిమాలు చూడను"

"అవున్లే. అలాంటి సినిమాలు గదిలో ప్రైవేటుగా వీసీఆర్లో చూడాలిగానీ పబ్లిగ్గా ఏం చూస్తాంలే. పోనీ సరదాగా హొటల్లో కెళ్దాం" అన్నాడు.

"క్షమించండి. ఇంట్లో పనుంది"

"ఇంట్లో పనివేరు. హొటల్లో పని వేరు. దేని దారి దానిదే" కళ్ళు చికిలించి నర్మ గర్భంగా నవ్వేడు.

అది పులిగర్జనలా అన్పించి బెదుర్తూ "నేనలాటిదాన్నికాదు సార్" తలొంచుకునంది.

"యూసీ. వయస్సూ వేడీ ఆట్టే కాలముండవు. వాటిని ఎంజాయ్ చేయడం నేర్చుకో. ఎంజాయ్ చెయ్యడమెలా అని అడుగు నేను నేర్పుతాను"

ఆమె ముఖం కందగడ్డ అయ్యింది. ముక్కుపుటాలదుర్తోంటే చటుక్కున లేచి నిలబడింది.

"కూల్డౌన్ గోమతీ. నీ కసలు సంగతి చెప్పనేలేదు కదూ. నీ మీద రెండు కంప్లయింట్లు వచ్చాయి. సీరియస్ ఎల్లిగేషన్స్ ఉన్నాయిలే. తీరా ఫైలు చూద్దునుకదా. ఇదివరకే చేసిన కంప్లయింటూ దాని మీద వార్నింగు ఇవ్వడమైనదని అప్పటి ఆఫీసరు రాసిన నోటూ కన్పించాయి...." అన్నాడు పులిరాజు.

"అలాటిదేం లేద్సార్. నేనెలాటిదాన్నో నాపై అధికారులందరికీ తెలుసు" అన్నది గోమతి.

"పెర్సనల్గా తెలిసుండొచ్చు. కాని కళ్ళెదుట కాగితం మీద కన్పిస్తోంటే కాదనటం బావుండదు కదా"

"నాకేం పాపం తెలియద్సార్. నేను సిన్సియర్ని అందుకే కుళ్ళుతో ఎవరో దొంగఫిర్యాదు చేసుంటార్సార్.....

"అంతే అయ్యుండొచ్చు. కాని నేనలా నమ్మినట్టు రాయాలి. రాయలేదనుకో నీ ఉద్యోగం ఊడిపోవచ్చు"

ఒక్కసారిగా ఆమె కళ్ళు జలమయ్యాయి.

"సార్ సార్....మీరే రక్షించాలి సార్. కావాలంటే ఆఫీసులోని వాళ్ళనీ, కస్టమర్లనీ అందర్నీ ఎంక్వైరీ చెయ్యండి సార్. అయిదేళ్ళ నుంచి చేస్తున్నాను. ఎక్కడా రెడ్ మార్క్ లేద్సార్...."

"రెడ్ మార్క్ లేదు. ఉన్నదంతా వంక పెట్ట వీల్లేని నిండు యౌవనమే. అందుకే నువ్వంటే నాకిష్టం. ఒక్కసారి....ఒకే ఒక్కసారి నా కోరిక తీర్చు. ఈ ఫిర్యాదుల్ని బుట్టదాఖలు చేసేస్తాను. అంతే కాదు. నీకు ప్రమోషనూ ఇప్పిస్తాను. జీతం రెట్టింపవుతుంది. నీ జీవితమే గొప్పగా మారిపోతుంది"

"పెళ్లైనదాన్ని. మీరలా కోరడం భావ్యం కాదు...."

"పెళ్లైన చిలకలే నాకిష్టం. అరమగ్గిన జామపళ్ళ రుచే వేరు"అన్నాడు పులిరాజు నోరు చప్పలిస్తూ.

"సార్....ప్లీజ్..." ప్రాధేయపడింది.

"మనదంతా బిజినెస్ మైండ్. ప్రతీదీ బిజినెస్సే. బార్టర్ సిస్టంలోలా నీ దగ్గరున్నది నాకివ్వు. నా దగ్గరున్నది నీ కిస్తాను. నా ఆకలీ నీ సమస్యా రెండూ తీరిపోతాయి. ఇద్దరికీ మధురానుభూతులు మిగుల్తాయి...."

"మీకిది న్యాయం కాదు"

"పులిన్యాయం అంతే మరి" అదోలా నవ్వేడు.

"సార్....!" అర్థింపుగా బేలగా చూసింది.

"వెరీబాడ్. ఇంత చెప్పినా వినకపోతే ఎలా చెప్పు. కమాన్ గోమతీ. ఫర్గెట్ ఏబౌట్ ఎవ్విరిథింగ్. క్రొంగొత్త అనుభవాలకోసం నవ్యోత్సాహంతో చిందులేద్దాం. నీనెప్పుడూ చూడని స్టార్ హెూటల్స్‌లో ఎన్నడూ ఎరగని రుచులు చూపిస్తాను. కమాన్. లెటజ్ స్టార్ట్..."

"ఒక్క రిక్వెస్ట్...."

"ఒక్కటేమిటి వందైనా గ్రాంట్ చేసేస్తా. చెప్పెయ్"

"ఒక్కసారి మాఇంటికెళ్ళి మాబాబుకి పాలిచ్చి వస్తా"

ఆమెవంక చిత్రంగా చూసి పడీపడీ నవ్వాడతను.

"నా పేరు పులిరాజు అన్చెప్పి పులి ఆవూ కథ చెబుతున్నావా? నేను కథలోని పులినికాదు. వర్తమానంలోని పులిని" అన్నాడు పులిరాజు.

"నిజంసార్. నన్ను నమ్మండి. పాలు ఇచ్చి తప్పకుండా వస్తాను. తర్వాత ఆలస్యమైనా ఫర్లేదు..."

అపనమ్మకంగా చూశాడు.

ఆమె మెత్తబడినట్టు కన్పించింది.

"ఓకే. కాని ఓ షరతు చెప్పేనుగా. నేను పులిని కాదు. ఆవుని నమ్మను. ఆడమనిషిని అసలే నమ్మను. అందుకని నా కార్లో వెళ్ళిరా"

క్షణకాలం తటపటాయించి తలాడించింది.

"దట్సగుడ్. పన్లోపనిగా ఫ్రెషప్ఐ సెంటు స్ప్రే చేసుకుని వరాలిచ్చే దేవతలా రా" అని నవ్వేడు.

ఆమె వెళ్ళింది. ఉత్సాహంతో గంతులేశాడతను.

'ఓహ్! ఏమి అదృష్టం! అదృష్టం తన తలుపు భలేగా తట్టింది సుమా. కాదు కాదు. అదృష్టంచేత తనే తలుపు తట్టించాడు! తను రియల్లీ గ్రేట్. తన చూపు పడ్డ ఆడది చూపులూ తనువూ వాల్చాల్సిందే!'

పరమానందపడిపోయాడు.

ఆఫీసు టైమయ్యింది. అంతా వెళ్ళిపోయారు. ప్యూన్ని కూడా వెళ్ళిపొమ్మన్నాడు. ఇంటికి ఫోన్చేసి పార్టీఉందనీ భోజనానికి రాననీ చెప్పేడు.

గోమతితో గడపబోయే మధురక్షణాల్ని....ఆమె నగ్న శరీరంమీద పెట్టబోయే ముద్దుల్ని...ఆమె అంగాంగాలతో ఆడబోయే రసకేళిని....పదేపదే తలచుకుంటూ ఊరిపోయాడు!

గంట గడిచింది. ఎన్నో యుగాలైనట్టుగా అన్పించిందతనికి.

'ఇంకా రాలేదేవిటి చెప్మా? టోకరా ఇవ్వబోవట్లేదు కదా? ఊహూ. అలా అయితే ఈ పాటికి డ్రైవర్ తిరిగి రావాలి కదా. తోక జాడిస్తే పీక కత్తిరిస్తానని తను గ్రహించే ఉంటుంది. ఎంతైనా తెలివైంది కదా!'

మరో అరగంటకి గోమతి వచ్చింది.

"ఓహ్! వెల్కం గోమతీ. కథలోని ఆవులానే సిన్సియర్గా తిరిగొచ్చావు. అందుకు అభినందిస్తున్నాను. కాని పులిలా నిన్ను కనికరించి విడిచిపెట్టను సుమా. కమాన్ డియర్..." ఆమె చెయ్యి పట్టుకోబోయాడు.

"ఆగండి సార్. నేను అబలని కావచ్చేమోగాని ఆవుని కాదు కదా...." అన్నది గోమతి.

"నా పాలిట మాత్రం ఆకలి తీర్చే ఆవువే.....కామధేనువ్వే. కమాన్ గోమతీ. ఆలస్యం భరించలేను...."

తలుపు తోసుకునెవరో లోపలికొచ్చారు.

కోపంగా అటుచూసినా వాడల్లా ఖాకీ దుస్తులు చూసి షాక్ తిన్నాడు.

"మా అన్నయ్య" అంది గోమతి కూల్‌గా.

"ఆ....ఆహా....అలాగా....వెరీ గ్లాడ్ టు మీట్యూ...." చెయ్యి చాచాడు కరచాలనంకోసం.

అతడందుకోలేదు.

"బట్ అయామ్ నాట్ ఫీలింగ్ గ్లాడ్...."

వెర్రిగా నవ్వేడు పులిరాజు. "అసలేవయ్యిందంటే....

"ఏమయ్యింది?"

"ఏమీకాలేదు. కాన్ఫిడెన్షియల్ మేటర్స్ డిస్కస్ చేద్దామని పిలిచానంతే. అప్పుడప్పుడూ ఇలా పిలవటం మా ఆఫీసులో మామూలే. ఆ సంగతి మా స్టాఫ్ నెవర్ని అడిగినా కన్ఫర్మ్ చేస్తారు...."

అతడి మాటలు పూర్తవకుండానే బిలబిలమంటూ ఆఫీసు స్టాఫ్ అంతా లోపలి కొచ్చేశారు.

గ్రమాన్పడిపోయి పిచ్చిగా చూశాడు పులిరాజు. తను గోమతిని ట్రాప్ చేద్దామనుకుంటే అంతా కలిసి తనని ట్రాప్ చేశారని అర్థమైపోయింది.

"మీరంతా కలిసి నన్నేదో చెయ్యాలనుకుంటున్నారేమో. ఏమీ చెయ్యలేరు. మా మావగారు పవర్‌ఫుల్ పొలిటీషియన్. మా ఆవిడ ఇలా ఫోన్ చేస్తే చాలు అలా...." ఆపైన మంత్రించినట్లు మాటలాగిపోయాయి.

లోపలి కొస్తున్న భార్యని చూసి డీలాపడిపోయాడు పులిరాజు.

కాళ్ళ క్రింది భూమి కంపిస్తోంటే నిలువునా కంపించిపోతూ చూశాడు.

"అలా ఏమవ్వద్ది? నీ కథ మారిపోద్ది. అంతే" అందామె.

"అది కాదు..." ఏదో అనబోయాడతను.

"అదీ కాదు. ఇది అడవీ కాదు. ఇక్కడ నీలాటి పులికి స్థానమూ లేదు" అంటూ అంతా మూకుమ్మడిగా అతడి మీద విరుచుకుపడ్డారు.

మరి పది నిమిషాలకి మూలుగుతూ బయటపడ్డాడు పులిరాజు సారీ పిల్లిరాజు!

**(స్వాతి వారపత్రిక 3.9.1999)**